క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె, ఇ.కొత్తపల్లె 33/11 కె.వి., పట్టణంలోని ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని కడప రోడ్డు నుంచి గురుకుల పాఠశాల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా పరిహారం అందిస్తున్న కౌన్సిలర్

పులివెందుల : మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష ప్రభుత్వం నుంచి సహాయం అందనుంది. మంగళవారం రూ.లక్షలో రూ.10వేలు మృతుడి కర్మకాండలకు మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరపున కౌన్సిలర్ ఆలమూరు విజయ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ విజయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



పెద్దపుత్తలో అక్షింతలను పంపిణీ చేస్తున్న రామ భక్తులు

వల్లూరు : మండలంలోని పెద్దపుత్త గ్రామంలో మంగళవారం అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. అర్చకులు సూర్య నారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో రామ భక్తులు పెద్దపుత్త గ్రామంతో పాటు స్థానిక దళితవాడ, అరుంధతి వాడల్లో ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈనెల 22వ తేదీన సాయంత్రం ఇంటి ముందు దీపాలను వెలిగించి దీపోత్సవాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : అయోధ్య శ్రీరాముని అక్షింతలు మంగళవారం మండల పరిధిలోని గురిజాల గ్రామంలో ప్రతి ఇంటికి అయ్యప్పస్వామి భజన బృందం పంపిణీ చేశారు. కాషాయ జెండాలు చేతబూని పురవీధుల గుండా జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ఇంటింటికి శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేశారు.

గండి దేవస్థాన పాలక మండలి సభ్యులకు సన్మానం



పాలక మండలి సభ్యులను సత్కరిస్తున్న ఆలయ అసిస్టెంట్ కమిషనర్

వేంపల్లె : జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన గండి క్షేత్రం దేవస్థానంలోని పాలక మండలి పదవీ కాలం ముగియడంతో సభ్యులను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి, సిబ్బంది, వక్తలు ఘనంగా సత్కరించారు. మంగళవారం స్థానిక గండి ఆలయ ఆవరణలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో ఆలయ అభివృద్ధి కోసం పాలక మండలి సభ్యులు తమ వంతు సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. అనంతరం ఆలయ చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, పాలక మండలి సభ్యులు రామాంజులరెడ్డి, ఈశ్వరరెడ్డి, మునెమ్మ, శోభ, రెడ్డయ్యలు ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామిలను శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. త్వరలోనూ నూతన పాలక మండలి ఏర్పడనున్నట్లు ముకుందారెడ్డి తెలిపారు.

ముందస్తు సంబరాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో ఉన్న శ్రీసరస్వతి విద్యా మందిరం పాఠశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా సంక్రాంతి పండుగ ఉట్టి పడేలా విశిష్టత, సంప్రదాయాలు, కట్టుబాట్లు, వేషధారణలలో విద్యార్థులు ప్రదర్శించిన తీరు అందరిని ఆకట్టుకుంది. అనంతరం కోలాటం, చెక్క భజన, భోగి పండ్ల కార్యక్రమం, రంగు వల్లుల పోటీలు, భోగి మంటలు, తదితర పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

ప్రజా సంకల్ప పాదయాత్ర సంబరాలు

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు చేసిన ప్రజా సంకల్ప పాదయాత్ర ఐదు సంవత్సరాలు పూరైన సందర్భంగా చెన్నూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి



వల్లూరులో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : రాష్ట్రంలో వున్న సగటు పేద కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవడమే ప్రధాన ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం 100 శాతం హామీలను చిత్తశుద్ధితో నెరవేర్చిన జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం మనందరిపై వుందని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. వల్లూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగిన జగనన్న పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఒక లక్షా 65 వేల కోట్ల రూపాయలను లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ చేశాడన్నారు. ఇచ్చిన మాట మేరకు పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచి మాట నిలుపుకున్నారన్నారు. గతంలో చంద్రబాబు వేలాది హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని గాలికి వదిలేశారని విమర్శించారు. చంద్రబాబు ద్వాక్రా మహిళలకు 28 వేల కోట్లను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పసుపు కుంకుమ పేరుతో వడ్డీలకు కూడా సరిపోని విధంగా కేవలం రూ.5 వేల కోట్లను మంజూరు చేసి మహిళలను వంచించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏదో ఒక విధంగా ప్రజలను తిరిగి మభ్యపెట్టి అధికారాన్ని చేజిక్కించుకుని ప్రజా ధనాన్ని దోచుకోవడానికి చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఇందులో భాగంగా ఎన్నో హామీలను ఇచ్చి ప్రజలను మోసగించడానికి సిద్ధమవుతున్నాడని, ప్రజలు అప్రమత్తంగా వుండి తగిన బుద్ధి చెప్పాలన్నారు. నంతరం లబ్ధిదారులకు పెంచిన పెన్షన్‌లను, నూతనంగా మంజూరైన పెన్షన్‌లను పంపిణీ చేశారు.

అనంతరం మండలంలోని దుగ్గాయపల్లె గ్రామ సచివాయ పరిధిలో 8 మందికి, దిగువపల్లె గ్రామ సచివాలయాల పరిధిలోని 15 మందికి మంజూరైన ఇంటి స్థలాల పట్టాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షులు గంగయ్య, ఎంపీడీవో జయశ్రీ, తహసీ శంకర్‌రావు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, ఎంఈవో లిల్లెమ్మ, సర్పంచ్‌లు కుళాయప్ప, శ్రీనివాసులురెడ్డి, రాజన్న, ఓబుల్‌రెడ్డి, ఎంపీటీసీలు రామ కృష్ణారెడ్డి, సుబ్బరాయుడు, పార్టీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, శివకుమార్ రెడ్డి, హరికేశవరెడ్డి, మునీంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వరం లాంటిది



సురక్ష కిట్లను అందిస్తున్న మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి

కమలాపురం : పేద ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వరం లాంటిదని డీఎంహెచ్‌ఓ నాగరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని పాడదుర్తిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–ఈ శిబిరాన్ని ఆయన సందర్శించారు. వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. పేద ప్రజలకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని వైద్యులకు ఆయన సూచించారు. ఎంపీడీఓ జ్యోతి, ఈఓఆర్‌డీ శారదారెడ్డి, వివిధ విభాగాల వైద్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేములలో..

వేముల : మండలంలోని వి.కొత్తపల్లె సచివాలయ పరిధిలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి హాజరై మాట్లాడారు. శిబిరంలో 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం సురక్ష కిట్లను రోగులకు పంపిణీ చేశారు. ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, సర్పంచ్ గంగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు భరోసా కల్పిస్తున్నారని బక్కన్నగారిపల్లె సర్పంచ్ మల్లయ్య తెలిపారు. మంగళవారం ఆ గ్రామ సచివాలయంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యకర్మం నిర్వహించారు. 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీఓ దివిజ సంపతి, ఎంపీటీసీ వరాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలో మంగళవారం మండల వైద్యాధికారి మహమ్మద్ తాహా ఆధ్వర్యంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 420 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జిల్లా ప్రోగ్రామ్ అధికారి రమేష్, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు.

రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష'

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మగూడూరు సచివాలయ పరిధిలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సింహాద్రిపురం పీహెచ్‌సీ వైద్యులు ఈ శిబిరంలో వైద్య సేవలు అందించి మందులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ అంకాలమ్మ, పంచాయతీ సెక్రటరీ వెంకట్రాముడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సామాజిక సాధికార సంకల్ప సభ



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్న అని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కార్యాలయంలో కౌన్సిలర్ కాంతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సాధికార సంకల్ప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇన్నేళ్లుగా ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల జీవితాలలో వెలుగులు నింపారని.. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం రూ.350 కోట్ల వ్యయంతో విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్న శుభ సందర్భంగా రాష్ట్రంలో సామాజిక సాధికార సంకల్ప సమావేశాలు విజయవంతంగా సాగుతున్నాయన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సామాజిక సాధికార మహా శిల్పానికి సంఘీభావంగా బ్యానర్‌పై అందరూ సంతకాలు చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.రఘునాథరెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

12న మహిళలకు ఆటలు, ముగ్గుల పోటీలు

చెన్నూరు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా భారత జాతీయ వారసత్వ సంస్కృతి పరిరక్షణ సంస్థ(ఇంటాక్) ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు చెన్నూరులో మహిళలకు పలు అంశాల్లో పోటీలను నిర్వహించనున్నట్లు సంస్థ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గులు పోటీలు, మ్యూజికల్ చైర్, టక్ ఆఫ్ వార్ తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. అదే రోజు బహుమతులు ప్రధానం చేస్తామన్నారు. ఆసక్తిగల మహిళలు తమ పేర్లను ఫోన్ నెంబర్ 6305248077లో 11వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఎర్రగుంట్ల : విజయవాడలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగల విగ్రహాన్ని, స్మృతి వనంను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీన ఆవిష్కరిస్తున్న సందర్భంగా మంగళవారం ఎర్రగుంట్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డిలు ఆవిష్కరణ చేశారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

వేంపల్లె : మామిడిలో సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని హెచ్‌ఓ రెడ్డయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని అలిరెడ్డిపల్లె గ్రామంలో రైతులు సాగు చేసిన మామిడి తోటలన ఆయన పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. మామిడిలో పూత నుంచి కోత వరకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, రైతులు ఆచరించాల్సిన సస్యరక్షణపై వివరించారు. అధికారుల సూచనలు, సలహాలు పాటించడం ద్వారా మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి



డ్రోన్‌లో నానో యూరియా పోస్తున్న అధికారులు

కమలాపురం : పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మలత తెలిపారు. మంగళవారం లేటపల్లెలో జరిగిన వికసిత భారత్ కార్యక్రమంలో ఆమె రైతులకు వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. రైతుల శ్రేయస్సును కోరి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, ఆదాయం సాధించవచ్చన్నారు. ఊటుకూరు కేవీకే శాస్త్రవేత్త సాయి కిరణ్మయి మాట్లాడుతూ రైతులు పంటల సాగులో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు, మెలకువలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు డ్రోన్‌లను సబ్సిడీపై అందిస్తుందన్నారు. డ్రోన్‌ల ద్వారా పెస్టిసైడ్స్ సులభంగా తక్కువ సమయంలో పిచికారి చేసుకోవచ్చన్నారు. కమలాపురం ఏఓ సరస్వతి మాట్లాడుతూ కమలాపురంలో 110 లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉందని, పూర్తి ధర చెల్లించి రైతులు తీసుకుంటే 50 శాతం సబ్సిడీ రైతుల ఖాతాలో జమ అవుతుందన్నారు. రబీ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు క్రాప్ బుకింగ్, ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. అలాగే పెద్దచెప్పలిలో జరిగిన వికసిత భారత్‌లో సర్పంచ్ నామాల చంద్రలీల, ఎంపీడీఓ జ్యోతి, ఈఓఆర్‌డీ శారదా రెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. వికసిత భారత్ పోస్టర్లు విడుదల చేశారు. వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 6వ వార్డులోని క్రాంతినగర్, నారాయణ కాలనీలలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి సమస్య వచ్చినా తాను తప్పక తీరుస్తానని ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ నాగిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలి

జమ్మలమడుగు : త్వరలో జరుగబోయే ఎన్నికల నిర్వహణలో భాగంగా అధికారులు నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతోపాటు, గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ సభాభవనంలో ఆయన నియోజకవర్గంలోని మండల తహసీల్దార్ సెక్టోరియల్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. అధికారులు ఎన్నికల విధులు నిర్వహించేటందుకు తమ పరిధిలో రూట్ ఆఫీసర్లు, పోలింగ్ కేంద్రాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఏమైన సమస్యలుంటే వాటిని సమీపంలో మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసుకునేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపండి

పులివెందుల టౌన్ : రాబోయే ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలపాలని పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు తెలిపారు.

మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి మట్లాడారు. ఈనెల 22వ తేదీన కొత్త ఓటర్ల జాబితా వస్తుందని.. అనంతరం కొత్తగా మార్పులు, చేర్పుల ప్రక్రియ ఎన్నికల నామినేషన్ వరకు కొనసాగుతుందని.. ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. పోలింగ్ కేంద్రాలలో సమస్యలు, మౌళిక వసతుల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తాం

కమలాపురం : అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చిన ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తామని ఈఆర్ఓ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన స్పెషల్ సమ్మరి రివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది అక్టోబర్ 27వ తేదీన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చిన ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తామన్నారు. ఈనెల 22న ఫైనల్ పబ్లికేషన్ ఉందని, అందులో మీరు ఇచ్చిన ఫిర్యాదులన్నీ పరిష్కారం అయ్యాయన్నారు. ఈ స్పెషల్ సమ్మరి రివిజన్‌లో 9613 ఓట్లు నమోదు చేయగా, డబుల్ ఎంట్రీ, మరణించిన వారివి 7282 ఓట్లు డిలీట్ చేశామన్నారు. ఇచ్చిన ఫిర్యాదులన్నింటిని పరిష్కరించిన తర్వాతనే ఈ పబ్లికేషన్ వస్తుందన్నారు.

వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలి



ర్యాలీలో వీసీ రంగజనార్దన్, తదితరులు

పులివెందుల రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్–2047లో భాగంగా జెఎన్‌టీయూ పులివెందుల ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి జెఎన్‌టీయూ అనంతపురం వీసీ రంగజనార్దన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్–2047లో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడం అనే అంశంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి మాట్లాడుతూ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలన్నదే వికసిత్ భారత్ కార్యక్రమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ శేషమహేశ్వరమ్మ, వివిధ డిపార్ట్‌మెంట్ల విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆడుదాం.. ఆంధ్రా పోటీలు



వల్లూరులో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి



కమలాపురంలో నిర్వహిస్తున్న ర్యాలీ

కమలాపురం : ఈనెల 10వ తేదీ నుంచి జరగనున్న ఆడుదాం.. ఆంధ్రా మండలస్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని నగర పంచాయతీ కమిషనర్ రాముడు తెలిపారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి పట్టణంలోని పలు కాలనీల్లో ఆడుదాం.. ఆంధ్రా ర్యాలీ నిర్వహించి వారు మాట్లాడారు. గత నెల 26వ తేదీ నుంచి సచివాలయ స్థాయిలో క్రికెట్, ఖో–ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ ఈవెంట్లలో పోటీలు నిర్వహించామన్నారు. బుధవారం నుంచి జరిగే మండలస్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, పంచాయతీ సెక్రటరీలు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలో మండలస్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఏ ఓబాయపల్లె సమీపంలోని క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువకుల కోరిక మేరకు ఆయన క్రికెట్ బ్యాట్ పట్టారు. పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ప్రభుత్వం మొదటి బహుమతి రూ.35 వేలు, రెండవ బహుమతి రూ.15వేలు, మూడవ బహుమతి రూ.5 వేలను ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. బహుమతి మొత్తానికి తాను తన సొంత నిధులను రూ.65 వేలు, రూ.35 వేలు, రూ.20 వేలు జత చేసి మొదటి బహుమతి రూ.1 లక్ష, రెండవ బహుమతి రూ.50 వేలు, మూడవ బహుమతి రూ.25 వేలు ప్రైజ్ మనీగా ఇవ్వనున్నట్లు తెలిపారు. గంగాయపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ శంకర్‌రావు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : స్థానిక వైఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలలో క్రీడా పోటీలు ఉంటాయన్నారు. ఈ మూడు రోజులపాటు మండల వలంటీర్లు తప్పనిసరిగా వారి యాప్‌లోనే ఆటల స్కోర్‌ను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. కాబట్టి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అలాగే పంచాయతీ సెక్రటరీ కూడా మూడు రోజులపాటు తప్పకుండా హాజరుకావాలన్నారు.

లింగాలలో..

లింగాల : ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులు జట్లుగా ఏర్పడి క్రికెట్ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో ఎంపీడీఓ జట్టు, పోలీసు జట్టు, రెవెన్యూ అధికారుల జట్లు హోరాహోరీగా క్రికెట్ ఆడారు. ఈ పోటీలలో గెలుపొందిన జట్టుకు ఎంపీడీఓ సురేంద్రనాథ్ ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం షీల్డ్‌లను బహుకరించారు. అలాగే పాల్గొన్న ప్రతి ఒక్కరికి మెమెంటోలను అందజేశారు. బుధవారం మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని క్రికెట్ జట్లు క్రికెట్ పోటీలలో పాల్గొంటారని ఎంపీడీఓ తెలిపారు. ఆర్డీఓ కాసేపు క్రికెట్ ఆడి అందరిని అలరించారు. కార్యక్రమంలో అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ రవికుమార్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీటీ త్రిభువన్‌రెడ్డి, ఎంపీ వ్యక్తిగత కార్యదర్శి రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.